## భద్రకాళికి లక్ష గులాబీలతో పుష్పార్చన

**ఉగాది వేళ అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు**



వరంగల్ : లక్షా గులాబీలతో భద్రకాళీ అమ్మవారికి పుష్పార్చన

వరంగల్/హనుమకొండ, ఏప్రిల్ 9 : ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారికి లక్ష గులాబీలతో పుష్పార్చన చేశారు. ఉగాది పురస్కరించుకొని భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. తెల్లవారుజామున పూర్ణాభిషేకంతో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో సాయంత్రం ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు పంచాంగ పఠించారు. అలాగే, హనుమకొండలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో వసంత నవరాత్రి పుష్పయాగం కార్యక్రమాలు ప్రారంభించారు. అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని ప్రత్యేక పూజలు చేశారు.



ములుగులో నిర్మించిన మెడికల్ కాలేజీ అనుబంధ దవాఖాన భవనం

## ములుగు, నర్సంపేట మెడికల్ కళాశాలలకు

# ఎన్ఎంసీ అనుమతి

**ఫలించిన కేసీఆర్ ప్రభుత్వ కృషి**

**50 నుంచి 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రవేశాలు**

ములుగు, ఏప్రిల్ 9(నమస్తేతెలంగాణ): ములుగు, వరంగల్ జిల్లా నర్సంపేట మెడికల్ కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) అనుమతి లభించింది. 2023 సెప్టెంబర్ 16న అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రూ.180కోట్లతో ములుగు మెడికల్ కళాశాల నిర్మాణం కోసం విడుదల చేసింది. అదే నెల 28న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఏజెన్సీ ప్రాంతానికి ములుగులో ప్రభుత్వ దవాఖాన సంజీవనిలా సేవలు అందిస్తుండగా జిల్లాకేంద్రం పరిధి ప్రేమ్‌నగర్‌లో రూ.54కోట్లతో 300 పడకలతో మెడికల్ కాలేజీకి అనుబంధ దవాఖానను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు పూర్తికాగా త్వరలో రాష్ట్ర ప్రభుత్వం దవాఖానను ప్రారంభించనున్నది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో ఉగాది పండుగ సందర్భంగా నర్సంపేట, ములుగు మెడికల్ కాలేజీలకు అనుమతులు లభించడం శుభపరిణామం. కేసీఆర్ ప్రభుత్వం గతేడాది నర్సంపేట, ములుగు కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా తాజాగా ఎన్ఎంసీ అనుమతులు దక్కాయి. దీంతో సుమారు 50 నుంచి 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఎన్ఎంసీ బృందం సభ్యులు త్వరలో ములుగు కళాశాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించి ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు తుది అనుమతులను మంజూరు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎంసీ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఎన్నికల ముఖచిత్రంలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటుంటాయి. సాధారణంగా ఏ పార్టీ అయినా వారి అభ్యర్థిని బరిలో దింపడం సహజం. కానీ సరైన నాయకుడు లేని కారణంగా రెండు ప్రధాన రాజకీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు బీఆర్ఎస్ నాయకులనే నమ్ముకున్నాయి. అటు కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్నా వరంగల్, మహబూబాబాద్ సెగ్మెంట్లలో ఆదరణ లేని కాషాయ పార్టీకి, ఇటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 'లోక్‌సభ ఎన్నికల్లో' సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతున్న హస్తం పార్టీకి అభ్యర్థులు లేక గులాబీ నేతలను తమ పార్టీలో చేర్చుకొని బరిలో దింపాయి. మహబూబాబాద్‌లో ఒక్క పోరిక బలరాంనాయక్(కాంగ్రెస్) మినహా అజ్మీరా సీతారాంనాయక్(బీజేపీ), వరంగల్‌లో అరూరి రమేశ్(బీజేపీ), కడియం కావ్య(కాంగ్రెస్), బాబూ మోహన్(ప్రజాశాంతి పార్టీ) ఇలా అందరూ ఇంతకుముందు బీఆర్ఎస్‌లో ఉన్నవారే కావడం ఆసక్తికరంగా మారింది. కాగా రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఓటరు తీర్పు ఎలా ఉంటుందన్న చర్చ సర్వత్రా నెలకొంది.

*– వరంగల్, ఏప్రిల్ 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



# అభ్యర్థులందరూ..

# 'బీఆర్ఎస్ వాళ్లే!

## ప్రధాన పార్టీల అభ్యర్థులుగా గులాబీ నేతలు


**వరంగల్, మహబూబాబాద్‌లోనూ ఇదే తీరు**

**కాంగ్రెస్, బీజేపీ తరఫున బరిలో ఉన్నది వీరే**

**రెండు పార్టీల్లోనూ నేతలు లేకే ఈ పరిస్థితి**

**బలరాంనాయక్ మినహా అందరూ..**

లోక్‌సభ ఎన్నికల్లో విచిత్రమైన పరిస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ నేతలే ప్రధాన రాజకీయ పార్టీల తరఫున అభ్యర్థులుగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీచేసిన వారు, టిక్కెట్ కోసం ఆశించిన వారు.. ఇటీవలే కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు అంతా మొన్నటివరకు బీఆర్ఎస్‌లో ఉన్నారు. వరంగల్, మహబూబాబాద్ స్థానాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నది. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఒక్కరే ఆ పార్టీకి చెందిన నేతగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం వచ్చినా లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు సరైన నాయకులు లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులను చేర్చుకున్నది. బీఆర్ఎస్ నుంచి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది. కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీది ఇదే పరిస్థితి. వరంగల్, మహబూబాబాద్‌లో బీజేపీ అభ్యర్థులు మొన్నటివరకు బీఆర్ఎస్‌లో పనిచేసిన వారే. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లకు ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు సవాలుగా మారాయి. కరువు, సాగునీటి సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందన్నదని ఆసక్తికరంగా మారింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వరంగల్, మహబూబాబాద్‌లో ఎప్పుడూ ఆదరణ లేదు. ఈసారైనా బలం నిరూపించుకోవాలని ఆ పార్టీ ప్రయత్నిస్తున్నది. గెలుపు ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆయా పార్టీల్లో సరైన అభ్యర్థులు లేకపోవడంతో బీఆర్ఎస్ నుంచి నేతలను చేర్చుకుని లోక్‌సభ ఎన్నికల అభ్యర్థులుగా నిలిపాయి.



మహబూబాబాద్ లోక్‌సభ స్థానానికి మూడు ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితను బీఆర్ఎస్ మరోసారి అభ్యర్థిగా ప్రకటించింది. బీజేపీ అజ్మీరా సీతారాంనాయక్‌ను ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసింది. సీతారాంనాయక్ 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మహబూబాబాద్ ఎంపీగా గెలిచారు. ఇటీవలే బీజేపీలో చేరారు. ఇక్కడ బీజేపీకి అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో బీఆర్ఎస్ నుంచి సీతారాంనాయక్‌ను చేర్చుకొని పోటీచేసే అవకాశం ఇచ్చింది. ఇదే స్థానంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న పోరిక బలరాంనాయక్ మాత్రం ఆ పార్టీలోనే ఉన్నారు. బలరాంనాయక్ కాంగ్రెస్ తరఫున 2009 ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా గెలిచారు. ఈయన 2014, 2019 ఎన్నికల్లో ఇదే స్థానంలో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు.

వరంగల్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను ప్రకటించాయి. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అరూరి రమేశ్‌కు బీజేపీ అవకాశం ఇచ్చింది. అరూరి రమేశ్ ఇటీవలి వరకు బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. బీఆర్ఎస్ తరఫున 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచారు. 2023 ఎన్నికల్లో ఇదే స్థానంలో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. బీజేపీకి అభ్యర్థులు లేకపోవడంతో ఆ పార్టీ బీఆర్ఎస్ నుంచి అరూరి రమేశ్‌ను చేర్చుకొని టిక్కెట్ ఇచ్చింది. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్యకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది. కడియం కావ్య తండ్రి శ్రీహరి పది రోజుల క్రితం వరకు బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ తరఫున 2014లో వరంగల్ ఎంపీగా, 2015, 2021లో ఎమ్మెల్సీగా, 2023లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలిచారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్యను బీఆర్ఎస్ ఖరారు చేసింది. అనంతరం కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో ఎవరూ లేకపోవడంతో ఆ పార్టీ కావ్యకు టిక్కెట్ ఇచ్చింది. కేఏ పాల్‌కు చెందిన ప్రజాశాంతి పార్టీ అభ్యర్థిగా బాబూ మోహన్‌ను ప్రకటించారు. ఆయన 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున అందోల్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవలే బీజేపీ నుంచి ప్రజాశాంతి పార్టీలో చేరారు. వరంగల్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ త్వరలో అభ్యర్థి ఖరారు చేయనున్నది.



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బాసుతండాలో పొలం వద్ద నుంచి తాగునీరు తీసుకువస్తున్న తండావాసులు

# తాగునీటికి తండ్లాట

**బాసుతండావాసులకు మళ్లీ మొదలైన కష్టాలు**

**బిందెడు నీళ్ల కోసం వ్యవసాయ బావుల వద్దకు పరుగులు**

**పట్టించుకోని అధికారులు**

*నర్సింహులపేట, ఏప్రిల్ 9 : తాగునీటి కోసం తండాలు తండ్లాడుతున్నాయి. గుక్కెడు నీటికోసం బోర్లు, వ్యవసాయ బావుల వద్దకు పరుగులు పెడుతున్నాయి. రోజురోజుకూ ఎండలు ముదరడం, తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా పల్లెపట్నం అనే తేడా లేకుండా ఇంటింటికీ శుద్ధి చేసిన జలాలను అందించింది. గత పదేండ్లలో ఎక్కడా తాగు, సాగునీటికి జనం ఇబ్బందులు పడిన దాఖలాలు లేవు. కానీ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే పదేళ్ల కిందటి రోజులు పునరావృతమవుతున్నాయి. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో చాలాచోట్ల నీటి కష్టాలు మొదలవగా ఇప్పుడు బాసుతండావాసులకు గడ్డు పరిస్థితి దాపురించింది. 'కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చిందంటూ' వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*



నీళ్లు పట్టుకుంటున్న తండా ప్రజలు


తాగునీటి కోసం తండాలు తండ్లాడుతున్నాయి. గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన దుస్థితి. పొద్దున్నే వ్యవసాయం, ఉపాధి పనులు చూసుకొని మధ్యాహ్నం నడి ఎండలో తాగునీటి కోసం వ్యవసాయబావులు, పొలాల వద్దకు పరుగులు తీయాల్సి వస్తున్నది. ఇంటిముందే నల్లా నీళ్లు పట్టుకునే పరిస్థితి నుంచి, పొలాల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి వచ్చిందని తండావాసులు వాపోతున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని బాసుతండా గ్రామ పంచాయతీకి కొద్ది రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పాటు తాగునీటి బావికి ఉన్న మోటర్ ఐదు రోజుల క్రితం కాలిపోవడంతో తండా ప్రజలు నీళ్ల కోసం అష్టకష్టాలు పడుతున్నారు. అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఎండాకాలం కావడంతో ఉదయమే వరి కోతలకు, ఉపాధి పనులకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి కనీసం మొఖం కడుక్కోవడానికి కూడా నీళ్లు ఉండడం లేదని చెబుతున్నారు. పశువులకు తాగునీరు లేక పొలాల వద్దకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాకు చెందిన బానోత్ మోహన్ తన వరి పొలం కోసం వేసిన పైపులైన్ నుంచి ప్లాస్టిక్ పైపుతో ఇంటి వద్ద ఉన్న సంపు నింపుకుంటుండగా, తండావాసులు అక్కడికి వచ్చి నీటి కోసం బారులు తీరుతున్నారు. దీంతో తన పొలం ఎండిపోతున్నదని మోహన్ వాపోతున్నాడు.



### ఇంటి ముందు చల్లడానికి నీళ్లు లేవు

పొద్దున్నే వరి కోతకు వెళ్లి ఇంటికి వచ్చినం. నీళ్ల కోసం గొడ్లు అరుస్తున్నాయి. ఆకలవుతుందని అన్నం వండుకుందామంటే నీళ్లు లేవు. పొద్దున 6 గంటలకు పనికి వెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చిన. ఇంట్లో చుక్క నీళ్లు లేకపోవడంతో పొలం వద్దకు వచ్చి పట్టుకుపోతున్నా. ఉగాది పండుగ రోజు ఇంటి ముందు చల్లడానికి నీళ్లు లేవు. పొలానికి పెట్టే నీళ్ల కోసం పోతే పొలం పారడం లేదని వాళ్లు గొడవ చేస్తున్నారు. మమ్ములను ఎవరూ పట్టించుకోవడం లేదు.

*– బానోత్ బద్రి, బాసుతండా*



### గొడ్లకు నీళ్లు లేక తిప్పలైతాంది..

ఎండలు దంచికొడుతున్నాయి. నీళ్లు లేక తిప్పలైతాంది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. పదేళ్లుగా నీళ్ల కోసం తిప్పలు లేవు. పొద్దున్నే ఉపాధి పనికి పోయి ఎండలో నీళ్ల కోసం పొలం కాడికి పోతున్నం. పొలం వాళ్లు వరి పారడం లేదని వారు నీళ్లు పట్టుకోవద్దంటున్నారు. మనుషులం అయితే ఎక్కడో అక్కడ తాగుతాం. గొడ్లు ఎట్లా బతుకుతాయి. ఇప్పుడు ఇట్లా ఉంటే రేపు ఎట్లా ఉంటుందో మా బతుకులు. ఇప్పటికైనా అధికారులు తాగునీటి గోసను తీర్చాలి.

*– లింగన్న*





వరంగల్ బస్‌స్టేషన్ ఆవరణలో కుప్పకూలిన వాటర్ ట్యాంకు (ఇన్‌సెట్‌లో) వాటర్‌ట్యాంక్ శిథిలాల నుంచి బొంత రవి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న కార్మికులు

## వరంగల్‌లో బస్‌స్టేషన్ కూల్చివేత పనుల్లో అపశ్రుతి

**వాటర్ ట్యాంక్ కుప్పకూలి కార్మికుడు మృతి**

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 9 : వరంగల్ బస్‌స్టేషన్ కూల్చివేత పనుల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. వాటర్ ట్యాంక్ కూలిపోయి కూలీ మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆవరణలోని వాటర్ ట్యాంక్ కూల్చివేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అక్కడ పనిచేస్తున్న బొంత రవి(40) శిథిలాల కింద పడి మృతిచెందాడు. వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇంతెజార్‌గంజ్ పోలీసులు చేరుకొని, యంత్రాల సాయంతో అతడి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఉగాది సెలవు కావడంతో రద్దీ తక్కువగా ఉన్నందున ప్రమాద తీవ్రత తగ్గిందని, లేకపోతే ప్రాణనష్టం తీవ్రం గా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ప్రయాణికులు అభిప్రాయ పడుతున్నా రు. మృతుడి స్వగ్రామం ఖానాపురం మండలం మనుబోతులగూడెం కాగా, వరంగల్‌లోని గరీబ్‌నగర్‌లో ఉంటున్నాడు. రవికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.